# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆ పార్టీ పార్లమెంట్ సభ్యులకు సూచించారు.

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా.. నూతన శాసన సభ్యుల జాబితాను గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కు ఈ రోజు అందజేశారు.

- ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

- నైరుతి రుతుపవనాలు... రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆ పార్టీ పార్లమెంట్‌సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉండవల్లిలో ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 16 మంది ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఇదిలాఉండగా చంద్రబాబు నాయుడును కలిసేందుకు శాసన సభ్యులు, అధికారులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయన ఇంటివద్ద భద్రతను పెంచారు. రేపు ఢిల్లీలో జరగనున్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి సమావేశంలో చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. కాగా... ఈ నెల 11వ తేదీన తెలుగుదేశం పార్టీ శాసన సభ్యుల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో తెలుగు దేశం పార్టీ శాసన సభా పక్ష నేతను ఎన్నుకోనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని ఒక వెయ్యి 400 మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పరిశీలన అనంతరం

తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బదిలీ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపి వేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారుల్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని కమీషనర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఈరోజు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఎన్నికైన శాసన సభ్యుల జాబితాను గవర్నర్ కు అందజేశారు. ఈ జాబితాలో 175 నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యుల పేర్లు, వారి పార్టీల వివరాలు పొందుపరిచారు. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం అదనపు ముఖ్య కార్యదర్శులు పి. కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తప్పక నెరవేరుస్తామని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నూతన పార్లమెంటు సభ్యులు భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఈరోజు ఆయన భీమవరంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడుగురు శాసన సభ్యులను సమన్వయం చేసుకొని పని చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = =

అనంతపురం జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు పరిసరాల్లోని మురుగు నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఓబులు సూచించారు. గుంతకల్లు మండలంలో సీజనల్ వ్యాధుల పై ఈ రోజు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, దోమల నివారణ కోసం పలు సూచనలను చేశారు. నీటి నిల్వలు ఉన్న చోట దోమలు వృద్ధి చెందుతాయని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ లాంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం వారి ఇళ్ళలోని నీటి నిల్వలను తొలగించి, మంచి నీరు నింపుకోవాలని ఆయన సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు... మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలకు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, కోస్తాఆంధ్ర లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. వచ్చే 3 - 4 రోజుల్లో వాయువ్య బంగాళాఖాతంలోని మరి కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొంది. రాయలసీమ, పరిసర ప్రాంతాలపై సముద్ర మట్టానికి 3 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉన్నట్టు వివరించింది. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాసం వుందని అలాగే ఉరుములతో కూడిన జల్లులు కూడా కురవచ్చని పేర్కొంది. అలాగే గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని విశాఖ తుఫాను హెచరికల కేంద్రం అధికారిని తెలియచెస్తూ.....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

టెన్జింగ్ నార్గే జాతీయ పురస్కారానికి గాను సాహస కృత్యాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు శ్రీకాకుళం యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యనిర్వాహక అధికారి(సీఈఓ ) బి. వి. ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... 2021, 2022, 2023 సంవత్సరాల్లో భూమి, సముద్రం, గాలిలో సాహస కృత్యాలు చేసిన వారు, అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిక చేసిన వారికి రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నట్టు ఆయన వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ లోగా https//awards.gov.in/ వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

శ్రీకాకుళం నియోజక వర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన తెలుగుదేశం అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. ఈరోజు ఆయన శ్రీకాకుళంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆరు సూత్రాల ప్రణాళిక తయారు చేశామని, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో దానిని అమలు చేస్తామని పేర్కొన్నారు. శ్రీకాకుళం - ఆమదాలవలస రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని, కోడి రామ్మూర్తి క్రీడా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని వివరించారు. సాగునీటి ఎద్దడిని నివారించేలా వంశధార, నాగావళి నదుల నుండి వస్తున్న కాలువల పొడిగింపును పూర్తి చేస్తామని పేర్కొంటూ... నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు ఈ నెల 17 నుండి నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం(TTD) అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... ప్రతి సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు అమ్మవారికి రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాగా... ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు TTD అధికారులు తెలిపారు

= = = = = = = = = = = = = = = = = = = =

మచిలీపట్టణాన్ని హైడ్రోజన్ ఇంధన రంగానికి వేదికగా తీర్చిదిద్దుతామని తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులు కొల్లు రవీంద్ర అన్నారు. ఈరోజు ఆయన మచిలీపట్నంలో ఎన్డిఏ భాగస్వామ్య స్థానిక నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పారిశ్రామిక, ఐటీ విప్లవాల తర్వాత ప్రపంచాన్ని శాసించేది హైడ్రోజన్ ఇంధనమే అని అయన పేర్కొన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకువస్తామని, మచిలీపట్నాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బందరు పోర్టు నిర్మాణ పనులను సమీక్షించి పూర్తి స్థాయిలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 28వ తేదీన విశాఖలో 100వ పోస్టల్ డాక్ , పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రైల్వే మెయిల్ సర్వీస్ - వి డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్న రెడ్డి తెలిపారు. ఆర్. ఎం. ఎస్ వి డివిజన్ పరిధిలోని ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు తపాలా సేవలు, పింఛన్ల వ్యవహారాలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 21వ తేదీ లోగా అందజేయాలన్నారు. ఫిర్యాదులను ఆర్.ఎం.ఎస్. -వి డివిజన్ సూపరింటెండెంట్ పేరిట ఎంవీపీ కాలనీలోని పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయానికి పంపించాలని ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తామని జమ్మలమడుగు శాసన సభ్యులు ఆది నారాయణ రెడ్డి అన్నారు. ఈరోజు ఆయన విజయవాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... జాతీయ ప్రజాస్వామ్య కూటమికి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియచేసారు. రాష్ట్రానికి మేలు చేసే అవకాశం లభించిందని, కూటమి సారధ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతామని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

వందేభారత్ రైళ్ళకు ప్రజల నుండి మంచి స్పందన లభించిందని విశాఖపట్నం రైల్వే శాఖ అధికారులు తెలియజేశారు. విశాఖ నుండి సింకిందరాబాదుకు రెండు సర్వీసులు, భువనేశ్వర్‌కు ఒక సర్వీసు నిర్వహిస్తున్నట్లు పేర్కంటూ... ఈ సర్వీసులు ప్రయాణికులకు గొప్ప ప్రయాణ అనుభూతిని కలిగిస్తున్నాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =